
పేపర్ బాయ్స్
కావలెను
సంచలన సాయంకాల పత్రిక 'సత్యం'లో పని చేసేందుకు పేపర్‌బాయ్స్ కావలెను.
- సంప్రదించండి -
94414 66455


## కేసులు పెడితే తప్పేముంది?

**అమరావతి:** అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కేసులు పెడితే తప్పేముందని ఏపీ హైకోర్టు ప్రశ్నించింది. జడ్జిలను కూడా దూషిస్తూ పోస్టులు పెట్టారని వ్యాఖ్యానించింది. పోలీసుల చర్యలను నిలువరిస్తూ ఎలాంటి ఉత్తర్వులను ఇవ్వలేమంది. కేసులపై అభ్యంతరముంటే నేరుగా కోర్టును ఆశ్రయించాలని చెప్పింది. పిల్ వేయడానికి వీలు లేదని పేర్కొంది. సామాజిక మాధ్యమ కార్యకర్తలపై మూకుమ్మడిగా కేసులు పెడుతున్నారని విజయబాబు హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది.





సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 13-11-2024

సంపుటి: 20 సంచిక: 195
పేజీలు: 4 వెల: రూ.1


# ఇసుక..వ్యాపారం కసాబిసా!

- విశాఖలో అవసరానికి మించి నిల్వలు
- టౌన్ కంటే గ్రామాల్లో ధర అధికం
- రీచ్ ఒడ్డున అనధికార వసూళ్లు
- ఇంకా ఊపందుకోని నిర్మాణ రంగం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

*క్రిష్ దర్శకత్వం వహించి దగ్గుబాటి రాణా, నయనతార జంటగా నటించిన కృష్ణమ్ వందే జగద్గురుం సినిమా చూశారా?.. అందులో మట్టిరాజు అనే ఒక పాత్ర ఉంటుంది. సమాజంలో భూగర్భాన్ని దొరిచేస్తున్నారని, భవిష్యత్తులో మట్టి, ఇసుక కూడా కరువైపోతుందని భావించే ఎల్‌బీ శ్రీరామ్ (మట్టిరాజు) తెర మీద కనిపించిన ప్రతీసారి మట్టిని ఎత్తి దాచుకుంటుంటాడు. సరిగ్గా ఇసుక ఉచితమన్న ఆదేశాల తర్వాత జిల్లాలో అదే తంతు జరుగుతోంది. ఇసుక ఉచితమైనా ప్రతీ రీచ్ నుంచి దాన్ని తరలించడానికి వీల్లేదు. అక్రమమో, సక్రమమో ప్రభుత్వం నిర్దేశించిన ర్యాంపుల నుంచి మాత్రమే ఇసుకను తీసుకువెళ్లాలి. అయితే ఆ ర్యాంపుల్లో ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లాలంటే.. గ్రామ పెద్దలుగా చెలామణి అవుతున్న మోతుబరులకు ట్రాక్టర్‌కు రూ.100 చొప్పన చెల్లించాలట. దూరంగా వెళ్లి ఇసుకను తెచ్చుకోవడమే ఒక పని అనుకుంటే, ఇప్పుడు అదనంగా రూ.100 చెల్లించడమేమిటని ఎక్కడ ఇసుక కనిపిస్తే అక్కడ తవ్వేసి పోగులు పెట్టేస్తున్నారు. దీంతో జిల్లాలో రాష్ట్రం మొత్తం అవసరాలకు సరిపడ ఇసుక ఇక్కడే పోగై వుంది. ఇసుక అందుబాటులో లేకపోవడం వల్ల గత ఐదేళ్లలో నిర్మాణాలు జరగలేదని, ఇప్పుడు అవి ఊపందుకుంటాయని భావించినా మనీ సర్క్యులేట్ కాకపోవడంతో నిర్మాణ రంగం ఇంకా జోరందుకోలేదు. ఎంతసేపూ విశాఖలో నిర్మాణమవుతున్న బహుళ అంతస్తులకు ఇసుకను తరలించడం మినహా జిల్లాలో ఆ స్థాయి నిర్మాణాలు లేవు. అనుమతులు ఉన్న ర్యాంపుల నుంచి, లేని ప్రాంతాల నుంచి, మరోవైపు ఒడిశా రేవుల నుంచి తరలిపోతున్న ఇసుకంతా వైజాగ్‌లోనే పోగవడం వల్ల ఇప్పుడు ఇసుక వ్యాపారానికి పూర్తిగా డిమాండ్ పడిపోయింది. పలు రేవుల్లో పోటీపడి తక్కువ ధరకు విశాఖపట్నం పంపించేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..*







ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం వల్ల ఇసుక ధరలు తగ్గడమే కాకుండా ఇసుకకు డిమాండ్ పడిపోయింది. కేవలం పార్టీని నమ్ముకున్నవారికి ఆర్థిక ప్రయోజనం కలిగించే ఆలోచనతోనే ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నారన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. పట్టణాల్లో కారుచౌకగా లభ్యమయ్యే ఇసుక గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ ధరకు సరఫరా చేస్తున్నారు. శ్రీకాకుళం నగరంలో, రీచ్‌లకు 10 కిలోమీటర్ల పరిధిలో మూడు టన్నుల ఇసుకను రూ.1000 నుంచి రూ.1200లకు సరఫరా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.2600 నుంచి రూ.3వేలు వసూలు చేస్తున్నారు. దీనికి కారణం ఇసుక రీచ్‌లు కలిగివున్న సమీప గ్రామాలకు బయట నుంచి ట్రాక్టర్లు అనుమతించడం లేదు. దీంతో ఇసుక రీచ్‌లు కలిగిన గ్రామాల నుంచి వెళ్లడానికి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.100 వసూలు చేస్తున్నారు. ఇసుకను ట్రాక్టర్లకు లోడ్ చేసే కూలీల రేట్లు పెంచేశారు.

**అనధికారిక లోడింగ్‌లు**

నెల రోజుల క్రితం వరకు 20 నుంచి 50 టన్నుల లారీని లోడ్ చేయడానికి రూ.18వేలు నుంచి రూ.30 వేలు వసూలు చేశారు. వీటిని విశాఖలో రూ.50వేల నుంచి రూ.70వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటూ ఉండేవారు. జిల్లాలో 14 రీచ్‌లను నామినేషన్ పద్ధతిలో అప్పగించిన తర్వాత అనధికారికంగా ఒక లారీని లోడ్ చేయడానికి రూ.8వేల నుంచి రూ.15వేలు మాత్రమే తీసుకుంటున్నారు. దీన్ని విశాఖకు తరలించి టన్నును రూ.600కు విక్రయిస్తున్నారు. దీనికి కారణం నూతన ఇసుక విధానం అమల్లోకి - మిగతా 4లో

## జిల్లా స్విమ్మర్స్‌కు పతకాల పంట



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాజమండ్రిలో ఈ నెల 10న జరిగిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. గోదావరి స్విమ్మింగ్ క్లబ్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో క్రీడాకారులు 21 స్వర్ణ, ఒక రజిత, రెండు కాంస్య పతకాలు సాధించి సత్తాచాటారు. ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బుక్కూరు ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దుప్పల వెంకటరావులు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి అభినందనలు తెలిపారు. ఈ మేరకు పుక్కళ్ల సత్యరాజు నాలుగు బంగారు, జి.సహదేవుడు నాలుగు బంగారు, డి.ప్రకాశరావు నాలుగు బంగారు, కిషోర్ రాకోటి మూడు బంగారు, ఒక రజతం, డి.గణపతి రెండు బంగారు, సీహెచ్ వెంకట్ రెండు కాంస్య పతకాలు సాధించారు. డిసెంబరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సెక్రటరీ నౌపడ రాజారావు, కోచ్ షేక్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

క్రీడల్లో మరింత రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్జీయుకేటి శ్రీకాకుళం డైరెక్టర్ కెవిజిడి బాలాజీ అన్నారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ వాలీబాల్ పోటీలో శ్రీకాకుళం ఆర్జియుకెటిలో విద్యను అభ్యసిస్తున్న ఎం.మౌనిక, ఎస్.జీవిత పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబర్చి త్వరలో జాతీయస్థాయిలో జరగబోయే ఎస్‌జిఎఫ్ వాలీబాల్ పోటీలకు సెలెక్ట్ అయిన విద్యార్థులను డైరెక్టర్ బాలాజీ అభినందించారు. జిల్లా అండర్-19 టీంకు శ్రీకాకుళం ఆర్జీయూకేటి ప్రాంగణంలోనే ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన రాజు, టి.దిలీప్ కుమార్ ట్రైనింగ్ క్యాంపును నిర్వహించి ప్రతిభకు పదును పెట్టడం ద్వారా విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చగలిగారని అన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఇంగ్లీషు విభాగపతి నూకేష్, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు, విశ్వనాథ్ బీసై, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.






- పైథాన్ పిల్ల రూ.25వేలు
- ఆఫ్రికా పిల్లి రూ.45వేలు
- బెంగళూరులో బ్రీడింగ్ సెంటర్
- ఒడిశాతో లావాదేవీలు
- బేరం కుదరక వెనక్కు వెళ్తూ పట్టుబడిన వన్యప్రాణులు



## కొండచిలువతో మసాజ్.. జిల్లా మీదుగా ట్రాన్స్‌పోర్ట్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కొండచిలువ, అడవి తాబేలు, సేవక పిల్లి.. ఇవన్నీ పెంపుడు జంతువులే అంటే మీరు నమ్ముతారా? అదేంటి.. పిల్లి, కుక్క, మేక, ఆవు కదా పెంపుడు జంతువులు! మనిషినే మింగేసే కొండచిలువ పెంపుడు జంతువేంటి అనుకుంటున్నారా? థాయ్‌లాండ్, మలేషియాల్లో పైథాన్ మసాజ్ అని ఒకటుంటుంది. బాగా బలిసిన కొండచిలువలను వంటిమీద మెత్తగా పాకించి మసాజ్ చేయించడమే అక్కడ స్పాల ప్రత్యేకత. సరిగ్గా కర్ణాటక నుంచి ఒడిశా మీదుగా తరలిపోతున్న ఈ విదేశీ వన్యప్రాణులను ఫారెస్ట్ అధికారులు ఇచ్ఛాపురం చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్న కేసులో ఇప్పుడు కొత్త కోణాలు వెలుగుచూస్తున్నాయి. సోమవారం సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ఇచ్ఛాపురం చెక్‌పోస్ట్ మీదుగా విదేశీ వన్యప్రాణులు తరలిపోతున్నాయని సమాచారం రావడంతో ఫారెస్ట్ రేంజ్ అధికారి మురళీకృష్ణంనాయుడు నేతృత్వంలో ఆ శాఖ అధికారులు 21 వన్యప్రాణులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 17 కొండచిలువ పిల్లలు, 3 తాబేళ్లు, ఒక అడవి పిల్లి ఉన్నాయి. వాస్తవానికి ఇవన్నీ పెంపుడు జంతువులేనని చట్టాలు చెబుతున్నాయి. కానీ వీటిని ఎగుమతి, దిగుమతి చేయడానికి ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ ఉండాలి. ఇది లేకపోవడంతో ఒడిశా నుంచి బెంగళూరు వెళ్తున్న వాహనంలో వీటిని స్వాధీనం చేసుకున్నారు. వాస్తవానికి బెంగళూరులో ఇటువంటి విదేశీ వన్యప్రాణులను పెంచి, వాటిని విదేశాలకు ఎగుమతి చేసే సంస్థ ఒకటి ఉంది. దీనికి కర్ణాటకలో ఫారన్ బ్రీడింగ్ సెంటరని పిలుస్తారు. ఇది నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు ఉన్న వైల్డ్‌లైఫ్ చట్టం ప్రకారం ఆ శాఖ అనుమతులు మాత్రం లేవు. ఒడిశాలో ఒక వ్యాపారి వీటి కోసం బెంగళూరులో అడ్వాన్స్ ఇచ్చి తెప్పించుకున్నారు. తీరా వీటిని అక్కడకు తీసుకువెళ్లిన తర్వాత మొత్తం సొమ్ము చెల్లించకపోవడంతో మళ్లీ వెనక్కు



బెంగళూరు తీసుకువెళ్తుండగా ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. టూరిజాన్ని ప్రోత్సహిస్తున్న దేశాల్లో వీటి ధర ఎలా ఉందో తెలియదు గానీ, ఇండియాలో మాత్రం సర్వల్ కేట్ ధర రూ.45వేలు ఉండగా, తెల్ల కొండచిలువ పిల్ల ధర రూ.25వేలు ఉంది. ఇందుకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో బెంగళూరుకు చెందిన సయ్యద్ లియాఖతుల్లా, విజయ్‌కుమార్, ముజాహిద్ అహమ్మద్ ఖాన్‌లను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. వన్యప్రాణుల చట్టం 1972 ప్రకారం సెక్షన్లు నమోదు చేశారు.

## రీకాల్ బిల్లు తేవాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జమిలి ఎన్నికలతో పాటు కొన్ని ఐరోపా దేశాల్లో అమల్లో ఉన్న రీకాల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీన ఢిల్లీరావు, సంఘం రాష్ట్రస్థాయి న్యాయ సలహాదారు చౌదరి లక్ష్మణరావు అన్నారు. ఈమేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ, వివిధ రాష్ట్రాల శాసనసభల సభ్యుల ఎన్నికకు జమిలి ఎన్నికలు ఒకేసారి జరిపించడానికి కేంద్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఆలోచన చేయడం మంచిదేనని, అలాగే రీకాల్ విధానం అమలులోకి వస్తే అవినీతిని అరికట్టవచ్చున్నారు.

## ప్రభుత్వమే 108 సర్వీసులను నిర్వహించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాష్ట్ర ప్రభుత్వమే 108 సర్వీసులను నేరుగా నిర్వహించాలని, స్లాబ్ ప్రకారం అందరికీ వేతనాలు చెల్లించాలని, సర్వీసును బట్టి స్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలనే 8 డిమాండ్లతో ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లాశాఖ ప్రతినిధులు కలెక్టర్ స్వప్నిల్ దినకర్, డీఎంహెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్‌లకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. 8 గంటల పని విధానాన్ని అమలుచేయాలని, గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇచ్చిన జీవో ఎంఎస్ నెంబరు 49 ప్రకారం నెలకు రూ.4వేలు తిరిగి పునరుద్ధరించాలని, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, 108లో ఉన్న అన్ని ఖాళీలను భర్తీ చేయాలని వారు పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్షుడు విజయ్‌మోహన్, ఈశ్వర్, శ్రీను, మురళీ, చిన్నబాబు, సతీష్ తదితరులు ఉన్నారు.


• ఎడిటోరియల్

## పోరాటయోధుడా.. పిరికివాడా?!

మాక్ అసెంబ్లీ.. మాక్ ఎమ్మెల్యేలు మాక్ ముఖ్యమంత్రి. మాక్ స్పీకర్.. ఇవి కాదు జగన్ మోహన్ రెడ్డి ముందు అసెంబ్లీకి వెళ్లి.. బడ్జెట్ మీద, బడ్జెట్ కేటాయింపుల మీద మాట్లాడాలి. గతించిన ఐదేళ్లలోనూ తను చంద్రబాబు ఏ23–4 పట్ల పాటించిన హేళన వైఖరి కళ్లముందు కనిపించటం వల్ల అందుకు ప్రతిగా తెలుగోడి పౌరుషానికి గుత్త అయిన పసుపు జట్టు తన పట్ల ఎలా స్పందింస్తారోననే భయంతో కామోసు ఆయన అసెంబ్లీకి దూరంగా ఉండిపోయి ఏదో అలా తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమిత మైపోతున్నారు. మరొక విషయం ఆలోచిస్తే అసెంబ్లీ సభ్యత్వం అనేది ఆ నియోజకవర్గానికి వహించే ప్రాతినిధ్యం. అదేదో ప్రైవేటు ఆస్తి అనుకుంటే పొరపాటు.అనుకూల వాతావరణం ఉంటేనే అక్కడికి పోతాను లేకుంటే పోను అనే స్వేచ్ఛ బహుశా ఏ సభ్యుడికీ లేదు. అలా హాజరుకావటం తనకి కుదరద నుకుంటే ఆయన చెల్లెలు షర్మిల చెప్పినట్టు ఆ సభ్యత్వాన్ని ఆయన వదులుకోవాలి. అసెంబ్లీకి పోయి ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించే మరొకరు ఎన్నిక కావటానికి ఈయన దారిచ్చేయాలి. ఇంకొక మాటేంటంటే ఎవరినో ఓదార్చటానికి వస్తానని ఇచ్చిన మాట నిలుపుకోవడానికి ఆయన సోనియాను కూడా ఎదిరించి ఎన్ని కష్టాలెదురైనా ఒంటరి పోరాటం చేసింది ఈరకం స్ఫూర్తితోనేనా? ఎదురుగా ముఖ్యమంత్రి పీఠం కనబడుతుంటే దానికోసం పడిన ఆరాటాన్ని పోరాటం అనుకోకూడదు, రెంటికీ తేడాను గ్రహించాలి. ఇప్పుడు కనుచూపుమేరలో పదవి లీలగా కూడా అగుపించటంలేదు. ఎందుకొచ్చిన జంజాటం ఇంట్లో కూర్చుని పబ్జీ ఆడుకుంటే పోదా అని అనుకున్నారు పాపం.. ఫలితం ఇదీ. కాకపోతే అమాయకపు భక్తులు మాత్రం ఇంకా మా అన్న మడమ తిప్పడూ, మాట తప్పడూ అనుకుంటూ అనవసరంగా హైరానా పడుతున్నారు. చంద్రబాబు ట్రాప్‌ను జగన్ తెలివిగా తప్పించు కున్నారు. శాసనమండలి సమావేశాలకు మాత్రం వైకాపా ఎమ్మెల్సీలను పంపిస్తూ శాసనసభకు తాను పులివెందుల ఎమ్మెల్యేగా హాజరుకావడం లేదని, తాను ఒక్కడే హాజరుకాకపోతే.. పిరికి సన్నాసి అనుకొనుకొంటారని తనతో పాటు మిగిలిన 10 మంది తన పార్టీ ఎమ్మెల్యేల చేత కూడా బంక్ కొట్టిస్తున్నారు. పైకి నాకు ప్రతిపక్ష హోదాను చంద్రబాబు భిక్షగా వేస్తేనే వస్తాను అని చెబుతున్నా.. అసలు విషయం, సభలో రఘురామరాజు ఉండడం. జగన్ పులివెందుల ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చెయ్యడానికి వచ్చిన రోజు, బిక్కజచ్చి, అసెంబ్లీకి దొడ్డిదారిన వచ్చారు. లోపలికి బిక్కుబిక్కుమంటూ వస్తున్నా.. అధికార కూటమి పక్షం అంతా హుందాగా వ్యవహరించారు. అనూహ్యంగా సభలో రఘు రామరాజు జగన్ను కలిసి పలకరించారు. అది చర్చనీయాంశంగా మారింది. జగన్ ఆ హుందాతనాన్ని శంకించారు. మంత్రుల తర్వాత పిలుస్తారా అని గోల పెట్టారు. ప్రజలు ఇవ్వని హోదాను భిక్షగా వేస్తామని గానీ, వెయ్యమని గానీ అధికార పక్షం చెప్పలేదు. కానీ ప్రమాణస్వీకారం చేసేసి పులివెందుల లో పనుందని, ఏదో నిజంగానే పనున్నట్లు ఒక రోజు పులివెందులలో గడిపి, మరుసటి రోజే బెంగళూరుకు వెళ్లపోయారు. కనీసం తన వైకాపా ఎమ్మెల్యేలకు అసెంబ్లీకి వెళ్లమని గానీ.. వెళ్లవద్దని గానీ చెప్పకుండా చెక్కేసారు. వారంతా అసెంబ్లీ వరకు వచ్చి, జగన్ నుంచి ఏ వర్తమానం లేక, వేచి చూసి, సభలోకి వెళ్లకుండా తిరిగి వెళ్లిపోయారు. రాఘురామరాజు అసెంబ్లీలో పలకరించాక, అయ్యన్న పాత్రుడు సభాపతి అయ్యి ఎన్నోసార్లు జగన్ సభకు వస్తే.. మైకు ఇస్తాం, సమయం ఇస్తాం అని టెంప్ట్ చేసినా కూడా జగన్ బెట్టువీడలేదు. అది బెట్టు కాదు భయం. అప్పటికీ నిన్నటి వరకు రఘురామరాజు కు ఏ పదవీ ఇవ్వకుండా.. డిప్యూటీ స్పీకర్ పదవిని వ్యూహాత్మకంగా ఇన్నాళ్లూ దాచివుంచారు చంద్ర బాబు. ఇక జగన్ రెడ్డి సభకు రారని నికరం అయ్యాక, రఘురామరాజుకు పదవిని ప్రకటించారు. హమ్మయ్య బతికిపోయా.. నేను అనుకున్నదే కరెక్ట్ అయ్యింది, సభకు బంక్ కొట్టి మంచిపని చేసా.. జస్ట్ మిస్.. ఎవరెంత టెంప్ట్ చేసినా.. తప్పించుకొన్నా అని ఎన్నికల ఓటమి తర్వాత ఇవ్వాళ జగన్ ఆనందిస్తూ వుండవచ్చు. సభకి ఎగ్గొడితే రాజీనామా చెయ్యి అని చెల్లెలు ఛీకొడుతున్నా.. ఆమెకేం తెలుసు తన అసలు బాధ, భయం అని మొట్టమొదటిసారిగా సభకు వెళ్లని ఒక పిరికివాడిగా జగన్ గెలిచారు. చరిత్ర సృష్టించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4) ప్రకారం.. శాసనసభ సభ్యుడు.. ఎలాంటి అనుమతి తీసుకోకుండా 60 రోజుల పాటు శాసన సభకు గైర్హాజరు అయితే.. ఆ స్థానం ఖాళీ అయినట్లుగా ప్రకటిస్తారు. ఈ విషయం జగన్‌కు ఎవరూ చెప్పినట్లు లేరు.

# పోలీసు అంకుశం తరుముతుంటే..

# ఇప్పుడు 'కంఠశోష'ల్ మీడియా..!




**పక్కాగా ఒక రాజకీయ పార్టీకి కార్యకర్తలుగా దురుద్దేశాలతో, ఆడవాళ్లను, పిల్లలను కూడా వదలకుండా నీచమైన పోస్టులు, మార్ఫింగ్ ఫోటోలు, ఎడిటెడ్ వీడియోలతో ప్రచారాలు. వీళ్లపై ప్రభుత్వం ఉరుముతుంటే, వేటాడుతుంటే, కేసులు పెడుతుంటే, అరెస్టులు చేస్తుంటే.. దీన్ని 'ప్రశ్నించే గొంతులపై కత్తులు' అని చిత్రించడం కరెక్టేనా..? ఇది ఏపీలోనే కాదు, తెలంగాణలోనూ..! కాకపోతే ఏపీతో పోలిస్తే ఆడవాళ్లు, పిల్లలు, కుటుంబాలను కూడా నీచమైన ప్రచారాల్లోకి తీసుకురావడం తెలంగాణలో తక్కువ.**

సాక్షి కథనాన్ని బట్టి ఏపీ ప్రభుత్వం ఇప్పటికి 680 మందికి నోటీసులు ఇచ్చింది, 147 కేసులు పెట్టింది, 49 అరెస్టులు, దమనకాండ, నిర్బంధకాండ ఎట్సెట్రా రాసుకొచ్చింది. కూటమి సర్కారు వైకాపా యాక్టివిస్టులనే టార్గెట్ చేస్తోంది కాబట్టి సాక్షి తరఫున డిఫెండ్ చేసుకోవడమూ సహజమే, దాని అవసరం అది.

ఈనాడు, ఆంధ్రజ్యోతి ఈ కేసులు సబబే అని రాసుకొస్తున్నాయి.. కూటమి ప్రభుత్వం యాక్షన్ కాబట్టి, నిజంగానే వైకాపా సోషల్ యాక్టివిస్టులు అడ్డూఅదుపూ లేకుండా అలాంటి పోస్టులు పెట్టారు కాబట్టి. కానీ టీడీపీ యాక్టివిస్టులు ఏమైనా తక్కువా..? జనసేన తక్కువా..? మరి ఆ పోస్టుల మీద ఈ యాక్షన్ లేదెందుకు అనే ప్రశ్న కూడా సబబే. నిన్న ఫేస్‌బుక్‌లో ఓ పోస్టు, ఓ టీవీ హెడ్డింగ్ ఫోటో చూశాను. అది జగన్ భార్య భారతిరెడ్డి మీద అత్యంత నీచంగా ఉంది. ఆ టీవీ ఓనర్‌కు ఏకంగా టీటీడీ చైర్మన్ పోస్టు ఇచ్చారు కదానేది ఆ పోస్టు ప్రశ్న. దీనికి చంద్రబాబు దగ్గర సమాధానం లేదు.. ఉండదు. (ఆ ఫోటో ఇక్కడ పోస్ట్ చేయదలుచుకోలేదు, నీచంగా ఉంది) శ్రీరెడ్డి వంటివాళ్లు కాళ్లబేరానికి వచ్చి, క్షమాపణలు కోరుతున్నారు. కేసుల అంకుశం తరుముతుంటే పారిపోతున్నారు. కొందరు అజ్ఞాతం లోకి వెళ్లిపోయారు. ఒకాయన సాక్షిలో రాస్తాడు, ప్రస్తుత చట్టాల ప్రకారం, సెక్షన్ల ప్రకారం ఈ కేసులు నిలవవు అని. ఐటీ చట్టం అసలే వర్తించదు అంటాడు. పోలీసులు తలుచుకుంటే ఆ చట్టమే కాదు, ఏదైనా ప్రయోగిస్తారు. కేసులు నిలుస్తాయా లేదానేది కాదు సమస్య.. ఫస్ట్ ఇలాంటి పోస్టులు పెట్టాలంటే భయపడాలి అనే భావనతో అంకుశం ప్రయోగించడం, పవన్ కల్యాణ్ కూతురి మీద చిల్లర పోస్టులు పెట్టిన వాళ్ల మీద పోక్సో కేసు కూడా పెట్టొచ్చు.. మన చట్టాల్లో సెక్షన్లకు కొదవేముంది..? అయితే ఒక గ్రూపులో సభ్యుడిగా ఉన్నందుకు ఆ గ్రూపులో ఎవడో ఏదో పోస్టు పెడితే గ్రూపు సభ్యులందరినీ బుక్ చేస్తున్నారని మరో ఆరోపణ వైకాపా నుంచి వినిపిస్తోంది. అది నిజమే అయితే దారుణమే. కానీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో అలాంటి సోషల్ గ్రూపుల నుంచి బయటపడటం మంచిది. వాళ్లూ వాళ్లూ బాగానే ఉంటారు, ఎలాగోలా బయటపడతారు, ఎటొచ్చీ ఆ గ్రూపుల్లో ఉన్నవాళ్లు సఫరవుతారు. తెలంగాణలోనూ బీఆర్ఎస్ సోషల్ దూకుడు పెరిగేకొద్దీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా చంద్రబాబులాగే ఉరమడం ఖాయం అనిపిస్తోంది. ఆల్రెడీ కేసులు, అరెస్టులు ప్రారంభమయ్యాయి కొన్ని. ఎప్పుడైతే పార్టీలు తమ కోసం సోషల్ మీడియా వ్యాపారులను నియమించుకుని, ప్రత్యర్థులపై చిల్లర పోస్టులకు ఉసిగొల్పుతున్నాయో అప్పటి నుంచే ఈ అరాచకం. మస్తు నీతులు చెప్పే ప్రశాంత్ కిషోర్ బాపతు ఐ–ప్యాక్ యాక్టివిటీతో ఇదంతా మొదలైంది. లక్షల ఫేక్ అకౌంట్లు, నియంత్రణ– పర్యవేక్షణ– పరిశీలన మన్నూమశానం లేనిది జుకర్‌బర్గ్ పైత్యం. మర్యాదస్తుల పోస్టులను కూడా తనకే సమజ్ కాని కమ్యూనిటీ స్టాండర్డ్స్, బ్యాన్ పేరిట సతాయిస్తాడు గానీ, ఆ చిల్లర పోస్టులు మాత్రమే యథేచ్ఛగా నర్తిస్తుంటాయి సోషల్ బజారులో.. బరిబాతల..!

మిత్రుడు చేగొండి చంద్రశేఖర్‌కు చెందిన జిందగీ ఇమేజెస్ పేజీలో తను వాకిట్లో ముగ్గు వేస్తున్న ఫోటో పెడితే ఫేస్‌బుక్ రిస్ట్రిక్ట్ చేసి, కమ్యూనిటీ స్టాండర్డ్స్ పేరిట ఉరిమింది.. అదీ ఐరనీ, అదీ కంట్రాస్టు, తెలుగులో చెప్పాలంటే అదీ వాడి అజ్ఞానం.

**అవునూ.. రేప్పొద్దున మళ్లీ జగన్ పవర్‌లోకి వస్తే.. టీడీపీ కూటమి సోషల్ యాక్టివిస్టులపై ఇదే తరహా వేట ఉంటుందా..? డౌటేముంది..? ఆ ఊరికి ఈ ఊరు ఎంత దూరమో, ఈ ఊరికి ఆ ఊరూ అంతే దూరం కదా. స్పందన, ప్రతిస్పందన.. కారం, ప్రతీకారం.. వర్తమాన రాజకీయాల్లో కనిపిస్తూనే ఉన్న ట్రెండ్ కదా..!**

**- ముచ్చట సౌజన్యంతో..**

# అషురెడ్డి అందాల బీభత్సం

**సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ కలిగిన టాలీవుడ్ భామ అషురెడ్డి ఇటీవల కాలంలో హాలిడేస్ ను ఎంజాయ్ చేస్తూ సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తోంది. ఆమె ఎలాంటి ఫొటోలు పోస్ట్ చేసినా కూడా అందులో గ్లామర్ డోస్ హై లెవెల్లోనే హైలెట్ అవుతోంది. ప్రస్తుతం పోర్చుగల్‌లోని లిస్బన్ వీధుల్లో తన అందం, గ్లామర్‌తో రచ్చ చేస్తోంది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ ఫోటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. బ్లూ కలర్‌లో స్లిమ్-ఫిట్ అవుట్‌ఫిట్ ధరించిన ఆమె, అద్భుతమైన బ్యాక్‌డ్రాప్‌తో తీసుకున్న ఈ ఫోటోషూట్‌లో సింపుల్ పర్ల్ నెక్లెస్‌తో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఈ స్టన్నింగ్ లుక్స్‌తో అషురెడ్డి తన ప్రత్యేక గ్లామర్‌ను మరోసారి ప్రదర్శించింది. అషురెడ్డి కెరీర్ ప్రారంభంలో జూనియర్ సమంతగా గుర్తింపు పొందినా, తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను అందుకుంటోంది. బిగ్‌బాస్ షోలో పాల్గొన్న తర్వాత ఆమె పాపులారిటీ మరింత పెరిగింది. ఆ తరువాత ఆర్జీవీతో చేసిన బోల్డ్ ఇంటర్వ్యూ, ఆమెకు ఊహించని క్రేజ్ తీసుకొచ్చింది. ఇప్పుడు, బాలీవుడ్ స్థాయిలో గ్లామర్ షో చేస్తూ, సౌత్ ఇండస్ట్రీలో ఆమె తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో క్రమం తప్పకుండా గ్లామరస్ ఫోటోషూట్లను పంచుకుంటూ తన ఫ్యాన్స్‌ను ఎప్పటికప్పుడు అలరిస్తుంది. ఈ లిస్బన్ ట్రిప్‌లో బ్లూ డ్రెస్సులో తీసుకున్న ఫోటోలతో అషురెడ్డి తన స్టైలింగ్ సెన్స్‌నీ మరింతగా ఎలివేట్ చేసింది. లిస్బన్ వీధుల్లో పోర్చుగీస్ సిటీలో తీసుకున్న ఈ ఫోటోలు వావ్ అనిపిస్తున్నాయి. ఫ్యాన్స్ కూడా ఆమె ఈ గ్లామర్ షోపై స్పందిస్తూ, ఆమె అందాన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. "ఒకప్పటి జూనియర్ సమంత ఇప్పుడు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది" అంటూ నెటిజన్లు కామెంట్లతో ప్రశంసిస్తున్నారు. బోల్డ్ లుక్స్‌లో చూపు సలపనంత అందం అందిస్తున్న అషురెడ్డి, ప్రస్తుతానికి సౌత్ ఇండస్ట్రీలోని గ్లామర్ ఫేవరెట్‌గా నిలుస్తోంది. ఈ తాజా ఫోటోషూట్ ఆమె ఫ్యాన్ ఫాలోయింగ్‌ను మరింతగా పెంచుతుంది అనడంలో సందేహమే లేదు. ప్రస్తుతం వివిధ అవకాశాల కోసం వెదుక్కుంటూ, రెగ్యులర్‌గా తన ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేస్తోంది. ఇక గ్లామర్‌లో మరో స్థాయికి ఎదిగే దిశగా ఆమె ప్రయాణం కొనసాగిస్తోంది.**

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**






# కోరికలే గుర్రాలైతే..? ఆశల రెక్కలు విరిగి ఎప్పుడో కూలబడతాయి!!

**మంచం ఉన్నంతవరకే కాళ్ళు చాపుకొనవలయును. పులిని చూసి నక్క వాత పెట్టుకోకూడదు. దూరపు కొండలు నునుపు. అప్పు చేసి పప్పు కూడు తినకూడదు. పరుగెత్తి పాలు తాగేకన్నా నిలబడి నీళ్లు తాగటం మంచిది.**

**Dont bite more than what you can chew.**

ఈ సూక్తుల సమాహారమే 1979లో వచ్చిన ఈ కోరికలే గుర్రాలయితే సినిమా. ప్రేక్షకుల మెప్పు పొందింది. నిర్మాతకు లాభాలు వచ్చాయి. ఏక్టర్లందరికీ పేరు వచ్చింది. స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహించిన దాసరి నారాయణరావుకు ప్రశంసలు లభించాయి. మూలకథ మాత్రం డి కామేశ్వరిది. టైటిల్సులో కూడా ఆమె పేరు వేసారు.

ఓ మధ్య తరగతి కుటుంబీకుడికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. ఒక్క కూతురు మాత్రం బాధ్యతగా ఆలోచించేది. మిగిలిన ముగ్గురు వాళ్ళ గోల వాళ్ళది. ఇద్దరు కూతుళ్ళలో ఒక కూతురు ఎప్పుడూ ఊహల్లో విహరిస్తూ ఉంటుంది. ప్రపంచంలో అందరూ సుఖపడి పోతున్నారు. తానొక్కదానికే ఏమీ లేదు అని నిత్యం, ప్రతి క్షణం విలపిస్తూ ఉంటుంది. Thomas Harris భాషలో I am not ok ; All are ok batch .

ఇలాంటి బడాయి బసవయ్య, బసవమ్మ సినిమాలు మనకు కుప్పలకుప్పలు. ఆల్మోస్ట్ అన్నింటినీ జనం చూసారు. ఎంతమంది మారారో తెలియదు. సావాసగాళ్ళు అనే సినిమాకు కాస్త దగ్గరగా ఉంటుందీ సినిమా.

కుటుంబ పెద్దగా కాంతారావు, ఆయనతోపాటు ఇంట్లోని తిక్కోళ్ళని భరించే గృహిణిగా నిర్మలమ్మ , ఇద్దరు కూతుళ్ళుగా ప్రభ, ఫటాఫట్ జయలక్ష్మి, ఒక సుపుత్రుడిగా మోహన్‌బాబు, మరో సుపుత్రుడి పేరు నాకు తెలియదు. ఆ ఇంటి రాంబంటుగా మురళీమోహన్, అతని మిత్రుడిగా చంద్రమోహన్ నటించారు. ఇతర పాత్రల్లో రాజబాబు, కె విజయ, రమాప్రభ, జయమాలిని, రామ్మోహన్ ప్రభృతులు నటించారు.

నటనాపరంగా ముందు ఫటాఫట్నే చెప్పుకోవాలి. తర్వాత ప్రభ, మురళీమోహన్, చంద్రమోహన్, మోహన్ బాబు. చెప్పిచ్చుకొక్కోడతా ఊత పదం మోహన్ బాబుకి.

సత్యం సంగీత దర్శకత్వంలో పాటలన్నీ బాగుంటాయి. కోరికలే గుర్రాలయితే పాట ఈ సినిమాకు ఐకానిక్ సాంగ్. సినిమాలో రెండు సార్లు వస్తుంది. ఒకసారి జయలక్ష్మి తన ఫ్రెండ్సుతో, మరోసారి చంద్రమోహన్ భార్యాబాధితుడు అయి పాడుతారు. ఆత్రేయ వ్రాస్తే బాలసుబ్రమణ్యం , సుశీలమ్మలు పాడారు.

ఈ సినిమాలో ఓ ప్రత్యేకమైన పాట ఉంది. లక్ష్మి నటించిన హిందీ బ్లాక్ బస్టర్ జూలీ సినిమాలోని జూలీ ఐ లవ్ యూ పాట ట్యూనుతో ఏమి వేషం ఏమి రూపం అని ఓ పాట ఉంది. మోహన్ బాబు, రమాప్రభల మీద ఉంటుంది. కొసరాజు వ్రాస్తే బాలసుబ్రమణ్యం, వసంతలు పాడారు.


మరో శ్రావ్యమైన పాట మనసే మన ఆకాశం మనమే రవిచంద్రులం. మురళీమోహన్, ప్రభల మీద ఉంటుంది. సి నారాయణరెడ్డి వ్రాస్తే బాలసుబ్రమణ్యం, సుశీలమ్మలు పాడారు. ఇంకో పాట చంద్రమోహన్, జయలక్ష్మిల మీద ఉంటుంది. సలాములేకుం రాణీ నీ గులాంనౌతాను. జయమాలిని మీద ఓ డాన్స్ పాట ఉంది కానీ జయమాలిని లెవెల్లో ఉండదు. దాసం గోపాలకృష్ణ వ్రాసారు. రేరే రేక్కాయలో అనే పాట . యస్ జానకి పాడింది.

దాసరి సినిమాల్లో ఏదో ఒక సందేశం డైరెక్టుగానో, ఇన్ డైరెక్టుగానో ఉంటుంది. సినిమా ఆఖర్లో తన వాయిస్ ఓవర్తో ప్రేక్షకులను బాదుతాడు. ఈ సినిమాలో కూడా ఆ బాదుడు ఉంది. ప్రతి ఒక్కరూ తప్పక చూడతగ్గ, చూడవలసిన సినిమా.

ముఖ్యంగా యువతీయువకులు, మధ్య వయస్కులు తప్పక చూడాలి. యూట్యూబులో ఉంది. చూసి ఉండకపోతే తప్పక చూడండి. మరోసారి చూసినా నష్టం ఏం లేదు. ఓ అలర్ట్ లాగా ఉంటుంది.

తెలుగుసినిమాల సింహావలోకనం..తెలుగుసినిమాలు..

**- (దోగిపర్తి సుబ్రహ్మణ్యం)**



# రథయాత్రతో భారత రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేశారు



ఒక నవల బాగా చదివించగల్గాలన్నా.. ఓ సినిమా విమర్శకుల ప్రశంసలందుకుని, మాస్‌నూ ఆకట్టుకుని హిట్ కొట్టాలన్నా.. అలాగే, ఓ పార్టీ ఇంతింతై వటుడింతై అన్నట్టుగా వటవృక్షంలా ఎదగాలన్నా మంచి స్క్రిప్ట్ అవసరం. పైగా దేశంలో జాతీయపార్టీ అంటే ఒకే ఒక్క కాంగ్రెస్ అన్నట్టుగా సాగిపోతున్న రోజుల్లో.. ఎవరో ఒకరి మద్దతు లేకుంటే ప్రభుత్వాలు నిలవలేని సంకీర్ణ రాజకీయ యుగంలో.. కాంగ్రెస్‌కు ఒక ప్రత్యామ్నాయ బలమైన పార్టీగా తీర్చిదిద్దడమంటే మాటలేం కాదు. ఇప్పుడు ఆ పార్టీకే ప్రత్యామ్నాయం లేదనేంత స్థాయి వచ్చిదంటే కూడా అది ఆయన చొరవే. అది చేశాడు కాబట్టే 96 దాటిన ఆ సంపూర్ణాయుష్కుడి గురించి ఆయన మనమోసారి మాట్లాడుకుంటున్నాం.

లాల్ కృష్ణ అద్వానీ.. పుట్టింది ప్రస్తుత పాకిస్థాన్ దేశంలోని కరాచీలో. 1935 నవంబర్ 8న జన్మించిన అద్వానీ కుటుంబం నాటి విభజన కాలంలో భారత్‌కు వలస వచ్చింది. అద్వానీ తన కళాశాల చదువుల వరకూ ముంబైలోనే ఉన్నారు. 1941లో జస్ట్ 14 ప్రాయంలో ఆర్ఎస్ఎస్‌లో జాయిన్ అయిన అద్వానీ.. రాజస్థాన్‌లో ప్రచారక్‌గా తన జీవితాన్ని ప్రారంభించారు. 1951లో శ్యాంప్రసాద్ ముఖర్జీ నేతృత్వంలో ఏర్పాటైన భారతీయ జనసంఘ్‌లో సభ్యుడైన అద్వానీ ఆ తర్వాత ఆ పార్టీలో పలు పదవులను చేపట్టడంతో పాటు.. 1967లో ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్‌కు ఛైర్మన్‌గా ఎన్నికై.. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జాతీయ కార్యనిర్వాహకుడయ్యే వరకూ.. అంటే 1970 వరకూ కొనసాగారు. ఇక అక్కడి నుంచి అద్వానీ జీవితం పూర్తిగా తాను ఆశించిన పొలిటికల్ టర్న్ తీసుకుంది. 1970లో తొలిసారి రాజ్యసభ సభ్యుడైన లాల్ కృష్ణ 1989 వరకూ నాలుగు పర్యాయాలు వరుసగా ఆ పదవిలో కొనసాగారు. 1973లో శ్యాంప్రసాద్ ముఖర్జీ స్థాపించిన జనసంఘ్ ప్రెసిడెంటైన అద్వానీ.. 1977లో జనతాపార్టీతో విలీనమయ్యే వరకూ కొనసాగడంతో పాటు.. 1977 ఎమర్జెన్సీ సమయంలో జనతాపార్టీ సాధించిన విజయంతో అద్వానీ సమాచార మంత్రిత్వ శాఖా మంత్రిగా కేంద్రంలో బాధ్యతలు చేపట్టడమే కాకుండా రాజ్యసభలో పార్లమెంటరీ పక్ష నాయకుడిగా వ్యవహరించారు.

ఇక అప్పటి వరకూ అద్వానీ పార్టీతో పాటు తానెదగడానికే చేసిన వ్యక్తిగత కృషే ఎక్కువ కనిపించ వచ్చు. కానీ, 1980 నుంచి అద్వానీ ఓ ట్రెండ్ సెట్టర్ అయ్యారు. అప్పటివరకూ భారత్ అంటే కాంగ్రెస్ అనే మాట బలంగా వినిపిస్తున్న రోజుల్లో.. ఎమర్జెన్సీ సమయంలో జనతాపార్టీ అధికారంలోకొచ్చినా.. మళ్లీ ఇందిర ముందు ఎక్కువకాలం స్థిరంగా నిలబడలేక పోయిన రోజుల్లో అటల్ బిహారీ వాజ్‌పాయ్‌తో కలిసి స్థాపించిన భారతీయ జనతాపార్టీకి మూడు పర్యాయాలు జాతీయ అధ్యక్షుడిగా పనిచేసి పార్టీని నిలబెట్టాడు. పార్టీ వ్యవస్థాపకుడిగానే కాకుండా.. అసలు భారతదేశ రాజకీయాల్లోనే బీజేపీ దృఢంగా నిల్చోవడానికి అద్వానీ చేసింది ఇవాల్టి బీజేపీ నేతల మాటలకు కూడా అందనంత ఆయనంత ఎత్తయిన విషయమంటే అతిశయోక్తి కాదు.

1989లో మొట్టమొదటిసారి లోక్‌సభకు ఎన్నికైన అద్వానీ.. ఏడుసార్లు వరుసగా లోక్‌సభలో ప్రాతినిథ్యం వహించారు. ఇవాళ బీజేపీ ఇంతింతై అంతెత్తు నిలబడటానికి.. మోడీ నాయకత్వంలో మూడోసారీ ఇంత పెద్ద దేశమైన భారత్‌లో అధికారంలోకి రావడానికి.. భారత్ అంటే కాంగ్రెస్సే అనుకునేంత స్థాయి బలమైన మదగజాన్ని లొంగదీసుకుని భారతీయ జనాతాపార్టీని అగ్రగామిగా నిలపడానికి అద్వానీ రాసిన స్క్రిప్ట్ మామూలుది కాదు.

ఒక్క బాబ్రీ మసీద్ కూల్చివేత ఘటన.. సెక్యులర్ రాజకీయాల్లో అద్వానీకి మాయని మచ్చైనా, అదే ఆయన్ను హిందుత్వ శ్రేణుల బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిపింది. 90ల్లో ఆయన చేపట్టి 10వేల కిలోమీటర్ల మేర సాగిన రామ రథయాత్ర అసలు బీజేపీ ఇవాళ ఈ స్థాయిలో నిలబడటానికి ఓ ప్రధానమైన పిల్లర్ అని చెప్పుకోకపోతే మూలాలు మరిచినట్టే. ఆయనపై అందుకు కేసు కూడా నమోదై.. అరెస్ట్ కూడా అయ్యారు. కానీ, కోర్ట్ అద్వానీని ఆ అంశంలో నిర్దోషిగా తేల్చేసింది. ఇవాళ అదే రామ జన్మభూమిలో ఒక కలగా మిగిలిపోయిన అయోధ్య ఆలయ నిర్మాణం కూడా సాకారమైందంటే.. మూలం అద్వానీనే.

ఇవాళ భారతీయ జనతాపార్టీ ఇంత దృఢంగా నిల్చోవడంలో అద్వానీ నామస్మరణను ఆ పార్టీ ఎప్పటికీ మరవకపోవడం కనీస కృతజ్ఞత. అయితే, ఆయన్ను భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇచ్చి గౌరవించారు సరే.. కానీ, ఆయన మోడీ నాయకత్వంలోని బీజేపీలో మాత్రం చాలా అవమానాలే ఎదుర్కొన్నారు. ఆయనకివ్వాల్సిన సముచిత గౌరవం కూడా చాలాసార్లు దక్కకపోవడం విషాదం. అసలు నరేంద్ర మోడీకి ఇవాళ బీజేపీ ప్రధానిగా మూడుసార్లు అవకాశం వచ్చిందంటే.. బీజేపీ కేంద్ర కేబినెట్‌లో ఇప్పుడున్న వారితో పాటు గత రెండు పర్యాయాల్లో ఉన్నవారంతా మంత్రులయ్యారంటే, అవన్నీ అద్వానీ అనే బీజేపీ పోస్టర్ బాయ్ పెట్టిన భిక్షే. కానీ, అదే పోస్టర్ బాయ్‌ని ఇవాల్టి బీజేపీగానీ, దాన్ని వెనుకుండి నడిపించే శక్తులు గానీ పట్టించుకోవాల్సినంత పట్టించుకోలేదు, గౌరవించలేదు. ఏ రామ జన్మభూమి కోసం ఆయన రథయాత్ర చేపట్టి.. దాన్ని ఇవాళ సాకారం చేశారో ఆ అయోధ్య ఆలయ నిర్మాణానంతరం ఆయన్ను ఆహ్వానించకపోవడం కన్నా అవమానం ఇంకేమీ ఉండదు. ఆహ్వానం అందిందని కొంత, వయస్సు మీరింది కాబట్టి, కరోనా సమయం కాబట్టి ఇబ్బందవుతుందని వద్దనుకున్నారని కొన్ని వార్తలు ప్రజల్లోకి ప్రచారంలోకి తీసుకెళ్లొచ్చునేమో గానీ అద్వానీ బీజేపీకి చేసిందాన్ని, అద్వానీకి ఇవాల్టి బీజేపీ చేసిందాన్ని జనమైతే మర్చిపోరు.

కేంద్రంలో బీజేపీ గద్దెనెక్కాక కావచ్చు.. అంతకు ముందు పార్టీ స్థాపనలో కావచ్చు వాజ్‌పాయ్ పాత్ర ప్రధానంగానే కనిపించినా.. బీజేపీని జాతీయస్థాయిలో తన రథయాత్ర ద్వారా నిలబెట్టి ఇవాళ జాతీయ ప్రత్యామ్నాయపార్టీగా మార్చి ఇప్పుడు మళ్లీ బీజేపీకి ప్రత్యామ్నాయమెవరనేంత ఎత్తుకు తీసుకెళ్లే స్థితికి రావడంలో మూలకారకుడు, నవశకాన్ని రచించిన వాడు మాత్రం ముమ్మాటికీ లాల్ కృష్ణ అద్వానే.

**ఇప్పటి బీజేపీలో ఎదుర్కొన్న అవమానాలు!**

మోడీ, షా నాయకత్వంలోని బీజేపీ కేంద్రంలో గద్దెనెక్కాక 2014లో గైడెన్స్ కౌన్సిల్ అని ఎలాంటి రాజకీయ అధికారాల్లేని ఒక కమిటీ ఏర్పాటుచేసి.. అందులో అద్వానీ లాంటివారికి అవకాశం కల్పించినట్టు ఓ సీన్ క్రియేట్ చేశారు. అప్పుడే నిర్ణయాధికారాల్లేని ఆ కౌన్సిల్ ఉంటే ఎంత, ఊడితే ఎంత అనే విమర్శలు వెల్లువెత్తాయి. మొత్తంగా పార్టీని నిలబెట్టిన వ్యక్తినే అవమానకరంగా తిలోదకాలిచ్చిన నేటి బీజేపీని ఓ ప్రత్యామ్నాయంగానే జనం చూస్తున్నారే తప్ప.. ఈ వ్యవహారాలను అర్థం చేసుకున్నవారు మాత్రం ముమ్మాటికీ హృదయపూర్వకంగా అభిమానించేందుకు సంశయిస్తూనే ఉంటారు.

1984లో కేవలం రెండు పార్లమెంట్ స్థానాల నుంచి 15 ఏళ్ల కాలంలో.. అంటే దశాబ్దంన్నరలో బీజేపీ ఇవాళ మహావృక్షమై నిల్చుందంటే అందుకు అద్వానీయే కారణమనే విషయం ఎంతో కొంత రాజకీయ చరిత్ర చదువుకున్న చిన్నపిల్లాడికి సైతం తెలుసు. కానీ, మోడీ, షా ద్వయం తమ ముద్రను వేసుకునేందుకు అద్వానీని దూరం పెట్టారనే వాదనా ఇప్పటికీ బలంగా వినిపిస్తూనే ఉంటుంది. అందుకే 2013లో పార్టీ పదవులన్నింటికీ అద్వానీ రాజీనామా చేసేశారు. అప్పటికే మోడీని 2014 ఎన్నికలకు ముందు ప్రచారానికి నాయకత్వం వహించేందుకు సిద్ధం చేస్తున్నారని తెలిసి మనస్థాపం చెందినట్టూ వార్తల్లోకెక్కారు అద్వానీ. ఆ సమయంలో అద్వానీ రాజీనామా పార్టీని ఒకింత షాక్‌కు గురిచేసింది. చాలామంది కీలకనేతలు ఆయన ఇంటికి వెళ్లారు.. నచ్చజెప్పారు.. బుజ్జగించారు.. దాంతో మరీ మారాం చేయడం బాగుండదనుకున్నారో ఏమోగానీ.. అద్వానీ మెత్తబడ్డారు. ఆ తర్వాత మోడీ ప్రమాణ స్వీకారానికి కూడా అయిష్టంగానే హాజరయ్యారు. ఇక 2019లో మోడీ, షా ప్రభ మరింత పెరగడంతో అద్వానీ కూడా అదే స్థాయిలో సైలెంటైపోయారు.

**2004 ఓటమి తర్వాత అద్వానీపై విమర్శలు!**

2004 సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత తిరిగి పార్టీకి నాయకత్వం వహించారు అద్వానీ. నాడే తన సొంత వెబ్‌సైట్, బ్లాగ్స్‌తో యువతకు సోషల్ మీడియా రూపంలో దగ్గరయ్యే వ్యూహాలను అమలుచేశారు. కానీ, 2009 ఎన్నికల్లోనూ ఆయన ప్రచారం అంతగా ఫలించలేదు. దాంతో యూపీఏ అధికారం చేజిక్కించుకుని మన్మోహన్ ప్రైమ్ మినిస్టర్ అయ్యారు.

2007 డిసెంబర్ పదో తేదీన అద్వానీ పేరు ప్రధాని అభ్యర్థిగా కూడా చర్చకొచ్చింది. లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు వచ్చే అవకాశముందన్న పరిస్థితుల్లో వాజ్‌పాయ్ వారసుడిగా ఆయన్ను ప్రకటించారు కూడా. పార్లమెంటరీ బోర్డ్ కూడా ఆమోదం తెలిపింది. అయితే, 2005లో ఆరు రోజుల పర్యటన కోసం పాకిస్థాన్ వెళ్లి జిన్నాను లౌకికవాదిగా పేర్కొనడంతో ఆయనపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. ఆయన తన అధ్యక్ష పదవి కూడా కోల్పోవాల్సి వచ్చింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు తాను ప్రధాని అభ్యర్థినని ఆయనే చెప్పుకోవడంతో సహచరులైన మురళీ మనోహర్ జోషి, యశ్వంత్ సిన్హా వంటివారే విమర్శలు గుప్పించారు. కానీ, ఆ తర్వాత మళ్లీ మురళీ మనోహర్ జోషే ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించడం కొసమెరుపు. మై కంట్రీ మై లైఫ్ అంటూ 2008లో తన ఆత్మకథను కూడా వెలువరించారు అద్వానీ.

**క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా..**

హిందుత్వ ముద్ర ఎంతలా వేసుకున్నారో.. నిజాయితీ విషయంలో అంత పేరుంది అద్వానీకి. పరిమితమైన ఆహారాన్ని తీసుకుంటూ 90వ ప్రాయం వరకూ సుదీర్ఘకాలం ఫిట్‌నెస్ కాపాడుకున్న నేత అద్వానీ. దశాబ్దాల సుదీర్ఘమైన ఆయన రాజకీయ ప్రస్థానంలో ఆయన కోరుకున్న ప్రధాని పదవి ఆయనకు దక్కి ఉండకపోవచ్చు.. చాలా ఊహాగానాలు వెలువడినట్టుగా ఆయన రాష్ట్రపతి పదవినీ చేపట్టి ఉండక పోవచ్చు.. కానీ, భారతదేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చిన నేతగా మాత్రం.. అద్వానీ పేరు ఎప్పుడూ ది లీడర్‌గా అలాగే నిలబడటం మాత్రం ఖాయం.

**- రమణ కొంటికర్ల**



# మగవారికి నో..!




**చాలామంది మహిళలకు మగవారితో పనిబడేది కొన్నిచోట్లే. వాటిలో టైలర్ షాప్ ముఖ్యమైంది. మిగిలిన ఏ విషయమైనా ఒప్పుకుంటారు గానీ ఒంటి కొలతలు పట్టుకుని సరిగ్గా కుట్టడం మగ దర్జీలకే సాధ్యం అనుకునేవారు చాలామందే ఉన్నారు. కొన్నిచోట్ల మహిళలు బోతిక్‌లు నిర్వహిస్తున్నా.. అక్కడా కుట్టుపని ఎక్కువగా మగవారిదే. అయితే పరపురుషులు తమ శరీరాన్ని తాకడం ఇష్టం లేనివారు వెతుక్కుని మరీ ఆడ టైలర్స్ దగ్గరికి వెళ్తారు. కొందరికి ఇళ్లల్లో ఆంక్షల వల్ల మగ దర్జీల దగ్గరికి వెళ్లలేరు. కొంతమంది మగానుభావులు తమ సమక్షంలోనే కొలతలు తీసుకోవాలనీ అంటారు. ఇవన్నీ మహిళలకు ఇబ్బంది కలిగించే విషయాలే. ఇటువంటి ఇబ్బందే జిమ్ విషయంలో కూడా.**

వ్యాయామం చెయ్యాలని ఉన్నా చాలామంది మహిళలు జిమ్‌కెళ్లలేరు. కారణం అక్కడ మగ శిక్షకులు ఉంటారు. వారు తాకితేనో.. ఆ ఊహే భరించలేనివారు చాలామంది. పోనీ మహిళల కోసమే వెలసిన జిమ్‌కి వెళ్తే సరైన పరికరాలు ఉండవు. ట్రైనర్లు ఉండరు. దాంతో చాలామంది నడకకే పరిమితం అవుతున్నారు. యోగా నేర్పే నిర్వాహకులు కూడా ఎక్కువగా మగవారే ఉంటారు. కొన్ని జిమ్‌లలో మాత్రం ట్రైనర్ తాకచ్చా లేదా అని అడిగి వ్యాయామ భంగిమలు సరిచేస్తారు. ఇటువంటి కారణాలపై అనేక గొడవలు. అలాగే ఈ మధ్య ఆడా మగా ఇద్దరికీ సేవలందించే బ్యూటీపార్లర్లు వెలిశాయి. అక్కడ కొన్ని సేవలు మగవారే చేస్తారు. ఇదీ చాలామంది మహిళలకు(వారి భర్తలకు) అభ్యంతరకరమే. ఈ సమస్యలన్నిటికీ చెక్ పెట్టేలా మహిళలకు ఉద్యోగావకాశాలు పెరిగేలా ఉత్తరప్రదేశ్ మహిళా కమిషన్ ఒక ఆలోచన చేసింది. పైన పేర్కొన్న ప్రదేశాల్లో మగవారు మహిళలని అసభ్యంగా తాకి వేధించకుండా ఆ పనులు మహిళలే చేపట్టాలని ప్రతిపాదించింది. అంటే టైలర్ షాప్‌లో కొలతలు ఆడవారే తీసుకోవాలి. బ్యూటీ పార్లర్‌లో అమ్మాయిలు మాత్రమే సేవలందించాలని, జిమ్ ట్రైనర్లు, యోగా సెంటర్లలో మహిళా ట్రైనర్లే ఉం డాలి. ఫలితంగా అనేక సమస్యలు తగ్గి మహిళలకి ఉపాధి పెరుగుతుందని మహిళా కమిషన్ అభిప్రాయం. కానీ ఇవన్నీ పాతకాలం సమస్యలు. అవన్నీ దాటి ముందుకొచ్చారు మహిళలు. ఈ కాలం అమ్మాయిలైతే అసలే పట్టించుకోరు. ఏదన్నా సమస్య ఎదురైతే ఆత్మరక్షణ విద్యలు నేర్చి బుద్ధి చెప్పమనాలి గానీ ఇదేం లాజిక్ అని యూపీలో ఆడా మగా సణుక్కుంటున్నారట.

*- కె.శోభ*

## నైట్‌షెల్టర్‌లో దుప్పట్లు పంపిణీ



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

గొంటివీధిలోని పట్టణ పేదల నిర్మూలన వ్యవస్థలో (నైట్ షెల్టర్) నిరుపేదలకు శీతాకాలం దృష్ట్యా దుప్పట్ల పంపిణీ కార్యక్రమం మదర్స్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ వైద్యురాలు, లయన్స్‌క్లబ్ సెంట్రల్ కార్యదర్శి డాక్టర్ పైడి సింధూర, మెంటర్ నటుకుల మోహన్‌లు దుప్పట్లను అందించి మాట్లాడుతూ చలికాలం దృష్టిలో పెట్టుకొని పేదలకు దుప్పట్ల రూపంలో వస్త్రదానం చెయ్యటం గొప్ప విషయమని, అందుకు మదర్స్ హెల్పింగ్ సొసైటీ డాక్టర్ పైడి ప్రదీప్ ముందుకు వచ్చి మంచి కార్యక్రమానికి పూనుకోవటం హర్షణీయమన్నారు. పలు ముఖ్య కూడళ్లలో ఉండే అభాగ్యులకు లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో దుప్పట్లను అందించే కార్యక్రమం నిర్వహిస్తామని, వీరిని స్ఫూర్తిగా తీసుకొని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉర్లం శివతేజ, కెనడా జార్జ్, పొడుగు చరణ్, డాక్టర్ పైడి ప్రదీప్, నైట్ షెల్టర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


















# ఇసుక.. వ్యాపారం కసాబిసా!!

(మొదటిపేజీ తరువాయి)

వస్తుందని ప్రకటించిన నెల రోజుల్లోనే విశాఖకు లక్షల టన్నుల ఇసుకను తరలించి టీడీపీ నాయకులు సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం విశాఖలో డిమాండ్‌కు మించి ఇసుక నిల్వలు ఉండడంతో ఇసుక అవసరం లేకుండా పోయింది. ప్రస్తుతం ఇసుకను కొందరు తరలిస్తున్నా మెట్రిక్ టన్ను రూ.600కు మించడం లేదు. అయితే దీన్ని కొందరు అక్రమార్కులు వదలడం లేదు. జిల్లాలోని జోగివంతులపేట, బూరవల్లి, బట్టేరు, గోపాలపెంటలతో పాటు మిగతా 10 రీచ్‌లను ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో టీడీపీ నాయకులకు కట్టబెట్టింది. ఈ రీచ్‌ల్లో రాత్రి వేళల్లో రోజు ప్రతి 60 నుంచి 100 లారీలు విశాఖ వైపు ఇసుకను తరలిస్తున్నారు. వీరికి పోటీగా నదీ పరివాహక ప్రాంతాల్లో స్థానికులు జట్టుగా ఏర్పడి అనధికారిక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకున్నారు.

**విధానం ఉచితం.. వ్యవహారం అనుచితం**

రీచ్ సమీప ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో పెద్దలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ట్రాక్టర్లను అడ్డుకుంటున్నారు. ట్రాక్టర్ అనుమతించాలంటే గ్రామానికి ఒక ట్రాక్టర్‌కు రూ.100 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. నదిలో ఇసుక లోడ్ చేయడానికి ఇతరప్రాంతాల నుంచి లేబర్‌ను ట్రాక్టర్లతో అనుమతించడం లేదు. ఆ గ్రామంలో ఉన్న కూలీలతోనే లోడ్ చేయించాలని నిబంధన పెడుతున్నారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్‌కు ఒక రకంగా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ట్రాక్టర్లకు వేరే రకంగా కూలి రేట్లు వసూలు చేస్తున్నారు. దీంతో నదుల నుంచి ఇసుకను తరలించడానికి ఇతర ప్రాంతాలకు చెందిన ట్రాక్టర్ల యజమానులకు ఉచిత ఇసుక అందని ద్రాక్షగా మారిపోయింది. జిల్లాలో అన్ని డివిజన్లలో ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయకపోవడంతో వీరంతా నదుల వద్దకు ఇసుకను తవ్వి లోడ్ చేసుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. రీచ్‌కు సమీప ప్రాంతంలో ఉన్న గ్రామ పెద్దలకు డబ్బులు చెల్లించి లోడ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో టన్ను ఇసుక రూ.వెయ్యికి మించి పలుకుతుంది.

**లారీలకు ఉచితంగా ఇవ్వాలి**

గత 20 ఏళ్లుగా శ్రీకాకుళం నుంచి విశాఖకు ఇసుక రవాణా చేస్తున్నాం, ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చింది కాబట్టి లారీలకు ఉచితంగా ఇసుక లోడ్ చేసే విశాఖలో విక్రయించి డబ్బులు చేసుకుంటామని ఈ నెల 11న కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో క్వారీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. ఉచిత ఇసుక పాలసీ వల్ల చాలా రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఉచిత ఇసుక అని చెప్పి జిల్లాలో నారాయణపురం, గార, బట్టేరు ర్యాంపుల్లో ప్రతి లారీకి 10 టైర్లు లారీకి రూ.12 వేలు, 12 టైర్లు రూ.14 వేలు, 14 టైర్లు రూ.16 వేలు, 16 టైర్లకు రూ.18 వేల లోడ్‌ఛార్జీలు తీసుకుంటున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ఎటువంటి మైనింగ్ బిల్లు, రశీదు ఇవ్వడం లేదని కలెక్టర్‌కు వివరించారు. దీనివల్ల ఇసుకను విశాఖకు తరలిస్తున్నప్పుడు ఓవర్ లోడ్ అని, మైనింగ్ బిల్లు లేదని లారీలపై కేసులు పెట్టి సీజ్ చేస్తున్నట్లు వివరించారు. ట్రాక్టర్లు మాదిరిగా తమకు ఇసుక ఉచితంగా లోడ్ చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. ఉచిత ఇసుక అమల్లోకి రాక ముందు వీరంతా ఒక్కో లారీకి రూ.20వేల నుంచి రూ.30వేలు ముట్టజెబుతూ వచ్చారు. అప్పుడు అక్రమంగా ఇసుకను విశాఖకు తరలించి లారీ ఇసుకను డిమాండ్‌ను బట్టి రూ.50 నుంచి రూ.70 వేలకు విక్రయించేవారు. ప్రస్తుతం ఇసుక డిమాండ్ తగ్గిపోవడంతో లారీ ఇసుక విశాఖలో రూ.20 వేలకు మించడం లేదు. దీంతో వీరంతా ఉన్నతాధికారులను ఆశ్రయించి ఉచితంగా ఇసుక లోడ్ చేసుకొనే వెసులుబాటు ఇవ్వాలని కోరుతున్నారు.

**సీపన్నాయుడుపేటలో..**

ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేట వద్ద ఉచిత ఇసుక అమల్లోకి వచ్చిన నాటికి కేవలం 5 ట్రాక్టర్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. వీటిని కేవలం ఇటుకలను తరలించడానికే వినియోగించేవారు. ఉచిత ఇసుక అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామంలో కొత్తగా 35 ట్రాక్టర్లు ప్రత్యక్షమయ్యాయి. మొత్తం 40 ట్రాక్టర్ల యజమానులంతా కలిసి గ్రామ సమీపంలో నాగావళి నదిలో తమ్మినాయుడు పేట వద్ద ఇసుక ర్యాంపును తెరచి సింగూరు తోటల్లో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి జేసీబీలతో లారీల్లో లోడ్ చేసి విశాఖకు ట్రాన్స్‌పోర్టు చేస్తున్నారు. సీపన్నాయుడుపేటకు చెందిన ట్రాక్టర్లు యజమానులంతా కలిసి సమీప గ్రామాల నుంచి వచ్చే ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేసేందుకు అనుమతించడం లేదని స్థానిక ట్రాక్టర్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల అవసరాలకు ఇసుకను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఫరీద్‌పేట, ఇబ్రహింబాద్, కుశాలపురం తదితర గ్రామాలకు చెందిన వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్లతో తరలించాల్సిన ఇసుకను లారీల్లో లోడ్ చేసి తరలించడం చట్ట విరుద్ధమని స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సీపన్నాయుడు గ్రామానికి చెందిన ట్రాక్టర్ల యజమానులంతా ఒక జట్టుగా ఏర్పడి స్టాక్ పాయింట్ ఏర్పాటుచేసి రేయింబవళ్ళు విశాఖకు లారీల్లో తరలిస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో లారీల్లో ఇసుకను విశాఖకు తక్కువ ఖర్చుతో తరలించుకోవచ్చని లారీల యజమానులు సీపన్నాయుడు పేట ట్రాక్టర్ల యజమానులను ఆశ్రయిస్తున్నారు. ఈ వ్యవహారంలో పార్టీలకు అతీతంగా టీడీపీ, వైకాపా నాయకులంతా ఒకట్టై ఇసుక వ్యాపారం చేసుకోవడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

**రీచ్‌లకు సమాంతరంగా స్టాక్ పాయింట్లు**

సింగుపురం గ్రామ పరిధిలో కొండమ్మ తల్లి టెంపుల్ నుంచి పల్లెవలసకు వెళ్లే తోవలో స్టోన్ క్రషర్ మధ్యలో ఒక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. బైరి అద్దురోడ్డు సర్వే నెంబర్లు 87లో పిండిమిల్లు ముందు ఒక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. అద్దురోడ్ జంక్షన్ నుంచి ఆమదాలవలస వెళ్లే మార్గంలో నైరా కాలేజీ దాటిన తర్వాత నక్కపేట బస్టాండ్ పక్కన ఒక్క స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేశారు. అంపోలు జంక్షన్ నుంచి శారద ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్లే మార్గమధ్యంలో అనధికారికంగా ఒక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. బైరి బస్ షెల్టర్ నుంచి బూరవెల్లి మధ్యలో ఒక స్టాక్ పాయింట్, సింగుపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని వైష్ణవి ఇంజనీరింగ్ కాలేజ్ వెనుకవైపు ఉన్న జగనన్న కాలనీలో ఒక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. వీటిని కరజాడ, బైరి, పొన్నాం, బట్టేరు నుంచి అక్రమంగా ట్రాక్టర్లలో తరలించి ఇసుకను స్టాక్ చేస్తున్నారు. ఈ స్టాక్ పాయింట్లను టీడీపీ, వైకాపా నాయకులు కలిసి ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్నారు. రీచ్ నుంచి సొంత నిర్మాణం కోసం తరలిస్తున్నట్టు చెప్పి స్టాక్ పాయింట్లకు తరలించే ట్రాక్టర్ల యజమానులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం మేరకు ఇసుకను స్టాక్ పాయింట్లకు తరలిస్తే అక్కడ నుంచి లారీల్లో లోడ్ చేసి విశాఖకు తరలిస్తున్నారు. ఈ అనధికారిక స్టాక్ పాయింట్ల వద్ద రూ.7 నుంచి రూ.10 వేలకే ఇసుక లారీల్లో లోడ్ చేస్తున్నారు. దీంతో కొందరు లారీల యజమా నులు అనధికారిక స్టాక్ పాయింట్లు నిర్వాహకులతో ముందుగా మాట్లాడు కొని అడ్వాన్స్‌లు ఇచ్చి ఇసుకను స్టాక్ చేయించి వీలు చిక్కినప్పుడల్లా విశాఖకు అక్రమంగా తరలిస్తున్నారు.

# కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రవిబాబ్జీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్‌గా బీజేపీ సీనియర్ నాయకుడు అట్టాడ రవిబాబ్జీని కూటమి ప్రభుత్వం నియమించింది. ఈయన బీజేపీలో పూర్వ జిల్లా అధ్యక్షుడుగా, ప్రస్తుతం రాష్ట్ర కార్య వర్గ సభ్యులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈయన నియామకంపై బీజేపీ జిల్లా నాయకత్వం హర్షం తెలిపింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, శవ్వాన ఉమామహేశ్వరి తదితరులు అభినందనలు తెలిపారు.

# అపార్ సమస్యలపై కలెక్టర్‌కు ఏపీటీఎఫ్ లేఖ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థులకు అపార్ ఐడి క్రియేట్ చేయడంలో ఇబ్బందులను తొలగించి ఒత్తిడి, తగ్గించి సమయాన్ని పెంచాలని శ్రీకాకుళం జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్మోహన్, ఎస్‌వి అనిల్ కుమార్ కలెక్టర్‌కు లేఖ రాశారు. ఉపాధ్యాయుల నియంత్రణలో లేని విషయాలపై టార్గెట్లు ఫిక్స్ చేసి టైంలైన్‌లు ఇచ్చి వేధించడం ఆపాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఒత్తిడి వల్ల క్లాస్ రూమ్‌లో జరగాల్సిన బోధనకు ఆటంకం కలిగి విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని గమనించాలన్నారు. స్కూల్ రికార్డులు, ఆధార్ వివరాల్లో వ్యత్యాసం వల్ల అపార్ ఐడి క్రియేషన్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ వ్యత్యాసాలు ప్రభుత్వ స్కూల్లో ఉండడానికి కారణం వారి తల్లిదండ్రులు నిరక్షరాస్యులు, లేదా ఈ అంశాలపై అవగాహన లేకపోవడమేనని తెలిపారు. ఎక్కువ తప్పులు ఆధార్‌లోనే ఉన్నాయనీ, ఆధారాలు వివరాలు సరిదిద్దటానికి ఆధార్ సెంటర్ల వారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇచ్చిన సర్టిఫికెట్లను అంగీకరించటం లేదని, బర్త్ సర్టిఫికెట్లు తీసుకురమ్మంటున్నారని, బర్త్ సర్టిఫికెట్లు తీసుకురావడానికి వారం నుంచి పది రోజుల సమయం పడుతుందని, తల్లిదండ్రులు తహసిల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగవలసి వస్తుందని తెలిపారు. హెడ్మాస్టర్లకు స్కూలు రికార్డులు మార్చే అధికారం ఇచ్చినప్పటికీ అపార్ క్రియేషన్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంపై ఉపాధ్యాయులపై తీవ్రమైన ఒత్తిడి చేయడం సమంజసం కాదని ఏపీటీఎఫ్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ మార్చే అధికారం స్కూల్ ఉపాధ్యాయులకు లేదనే విషయాన్ని గమనించకుండా ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి పెంచడం సరికాదని, కొంత సమయాన్ని ఈ పని కోసం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సమస్యలు పరిగణనలోకి తీసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను అధ్యక్షులు మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

# విప్‌గా ఎమ్మెల్యే బెండాళం అశోక్

**చౌదరి బాబ్జీకి నిరాశ**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ప్రభుత్వ విప్‌గా బెండాళం అశోక్‌ను ప్రకటించడంపై ఆయన సామాజిక వర్గానికి చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు పర్యాయాలు వరుసగా ఎమ్మెల్యేగా ఇచ్ఛాపురం నుంచి గెలుపొందిన అశోక్‌కు టీడీపీలో సరైన గుర్తింపు రాలేదన్న విమర్శలకు విప్ పదవితో పార్టీ అధినేత చంద్రబాబు చెక్ పెట్టారు. వాస్తవంగా చంద్రబాబు కేబినెట్‌లో సామాజిక సమీకరణాల నేపథ్యంలో అశోక్‌కు మంత్రి పదవి వస్తుందని తీవ్ర చర్చ సాగింది. అయితే కొన్ని కూర్పుల కారణంగా మంత్రి పదవి దక్కలేదు. 2014లో విప్ పదవిని అలంకరించిన అదే సామాజికవర్గానికి చెందిన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పేరును కేబినెట్ కూర్పులో మొదట చేర్చినా చివరి నిమిషంలో తొలగించారన్న ఆరోపణలున్నాయి. ఆ తర్వాత ఆయనకు ప్రభుత్వ పరంగా అనేక పదవులు చంద్రబాబు ఆఫర్ చేసినా, అందుకు కూన రవికుమార్ విముఖత చూపారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వ విప్ హోదాను బెండాళంకు కట్టబెట్టారన్న టాక్ ఉంది. కూన రవికుమార్‌కు చివరి రెండేళ్లకు మంత్రి పదవి ఇస్తామన్న హామీ ఉండడంతో ధీమాగా ఉన్నట్టు టీడీపీలోనే చర్చ సాగుతుంది. కింజరాపు కుటుంబానికి సన్నిహితుడిగా, వివాదరహితుడిగా ఉండడం ఎమ్మెల్యే అశోక్‌కు కలిసొచ్చిందని టీడీపీలో చర్చ సాగుతుంది. మరోవైపు పార్టీ జిల్లా అధ్యక్షులుగా, జెడ్పీ చైర్‌పర్సన్ ప్రతినిధిగా పార్టీకి విశేష సేవలందించిన చౌదరి బాబ్జీని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేయడం పట్ల ఆయన సామాజికవర్గంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. పోలాకి జెడ్పీటీసీగా గతంలో పని చేసిన రోణంకి కృష్ణంనాయుడుకి కళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవిని కట్టబెట్టి జెడ్పీ చైర్‌పర్సన్ ప్రతినిధిగా పనిచేసిన చౌదరి బాబ్జీని డైరెక్టర్‌గా ఎంపిక చేయడం పట్ల టీడీపీలో చర్చ సాగుతుంది. డైరెక్టర్ల ఎంపిక పట్ల కొందరు టీడీపీ నాయకులు అసంతృప్తితో ఉన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ 2019 సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందు హడావుడిగా కళింగ కార్పొరేషన్‌ను ప్రకటించి విమర్శలపాలైంది. ఇప్పుడు వైకాపా అనుసరించిన మాదిరిగానే కార్పొరేషన్‌ను ముందుగా ప్రకటించినా ఎంపిక చేయడంలో విమర్శలు ఎదుర్కొంటుంది.

# బెల్ట్‌షాపు నిర్వహిస్తే రూ.లక్ష జరిమానా



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బెల్ట్‌షాప్‌లు నిర్వహించే వారిపై కేసులు నమోదుచేసి లక్ష రూపాయలు జరిమానా విధించి బీఎన్ఎస్ఎస్ యాక్ట్ 2023ను అనుసరించి, సెక్షన్ 129 ప్రకారం బైండోవర్ చేయాలని డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి జిల్లా ఎక్సైజ్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం నెలవారీ క్రైమ్ మీటింగ్ నిర్వహించి ఎక్సైజ్ నేరాల అదుపునకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. బెల్ట్‌షాప్ నిర్వహించేవారి సమాచారాన్ని సేకరించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అధిక ధరలకు మద్యం విక్రయించే షాప్‌లపై డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించాలని ఆదేశించారు. ధరలను ఉల్లంఘించిన లైసెన్స్‌దారులపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఎక్సైజ్ పాలసీ 2024-26 ప్రకారం మద్యం లైసెన్స్‌దారులు ఉల్లంఘనలకు పాల్పడినా ఎక్సైజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సారా తయారీ, విక్రయాలు చేస్తున్నట్లు అనుమానం ఉన్న గ్రామాల్లో విస్తృత దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి సుంకం చెల్లించని మద్యం రవాణా కాకుండా బోర్డర్స్ స్టేషన్ అధికారులు, మొబైల్ పార్టీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధిగా ప్రతి మద్యంషాప్ లైసెన్స్‌దారుడు ఎమ్మార్పీ ధరలను సూచించే పట్టిక బోర్డు షాప్ ముందు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సూపరింటెండెంట్, ఎక్సైజ్, టాస్క్‌ఫోర్సు, మొబైల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# జీడీఏ కోర్సులో ఉచిత శిక్షణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టాటా స్ట్రైవ్ వారి సౌజన్యంతో బొల్లినేని మెడిస్కిల్స్ ఆధ్వర్యంలో జీడీఏ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించనున్నట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కోర్స్ చేసేందుకు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలు లోపు గల విద్యార్థినీ విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్ పాసైన లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ కోర్సులో చేరవచ్చని సూచించారు. మూడు నెలల శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామ న్నారు. డిగ్రీ పాస్ అయిన వారికి పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సు లో ఉచిత శిక్షణ ఇచ్చి, కార్పోరేట్ హాస్పిటల్స్‌లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని, ఇంటర్ పాస్ అయిన వారికి డిప్లమో పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. పూర్తి వివరాలకు 76809 45357, 9121 999 654 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఆసక్తి గలవారు రాగోలు జెమ్స్ హాస్పిటల్ క్యాంపస్‌లోని తమ కార్యాలయానికి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

# యువ ఉత్సవ్ పోటీల్లో రెండో స్థానంలో యోషిత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్.బిందు యోషితకు నెహ్రూ యువ కేంద్రం శ్రీకాకుళం జిల్లా స్థాయిలో మంగళవారం నిర్వహించిన యువ ఉత్సవ్ పోటీల్లో రెండో స్థానంలో నిలవటం హర్షణీయమని కళాశాల డైరెక్టర్ బరాటం శ్రీనివాస చక్రవర్తి, కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్ అన్నారు. ప్రతీ విద్యార్థి పోటీతత్వంతో ఉండాలని, అప్పుడే విజయం సాధిస్తారన్నారు. యోషిత గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ ద్వారా చదువుతూ, జిల్లా కీర్తిని, కళాశాలకు, గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్‌కు మంచి పేరు తేవటం ఆనందంగా ఉందని జీఈవో అధ్యక్షులు సద్గుణ తెలిపారు. జీఈవో ఇతర సభ్యులతోపాటు, కళాశాల యాజమాన్యం యోషితకు అభినందనలు తెలిపారు.



# క్యాంపస్‌లో 55 మంది కాకినాడ విద్యార్థులు ఎంపిక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రముఖ ఫార్మా కంపెనీ హెటిరో డ్రగ్స్ క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఈ ఇంటర్వ్యూల్లో తమ కళాశాల విద్యార్థులు 55 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎన్‌వీ వేణుగోపాల్ తెలిపారు. తమ కళాశాలలో విద్యార్థులకు డిగ్రీతోపాటు ఉద్యోగం సాధించే లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం 5వ సెమిస్టరులో ఉండగానే ప్రముఖ బహుళ జాతి సంస్థలో ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. కళాశాల సెక్రెటరీ సుగుణా రెడ్డి మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డిగ్రీ మొదట సంవత్సరం నుంచే క్యాంపస్ ఇంటర్వ్యూలకు తగిన శిక్షణ అందిస్తున్నామన్నారు. కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ జీజీవీ సుబ్రహ్మణ్యం, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆర్.రాజు, ఆద్యాపక బృందం ఈ విద్యార్థులను అభినందించారు.

**విద్యార్థినికి అభినందన**

ఇటీవల నంద్యాలలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ సీనియర్స్ తరపున రాష్ట్ర స్థాయిలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముంత గాయత్రి మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. సీనియర్స్ తరపున నేషనల్స్‌కు సెలెక్ట్ అయిన గాయత్రిని చైతన్య సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జెసి జామి భీమ శంకర్, రౌతు శ్రీనివాస రావు, వీటీ నాయుడు, సంపత్‌కుమార్, కిరణ్ అభినందించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం




విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దుచేయాలని, ఉచిత ఇసుక అమలు చేయాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని తదితర పలు ప్రజాసమస్యలపై ప్రచార, ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు తెలిపారు. బుధవారం టెక్కలిలో ప్రజాపోరు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లి యల్లయ్య, ఉర్జాన లక్ష్మణరావు, ఉర్జాన మాధవరావు, బగాది వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, టెక్కలి





# 15న శ్రీకైలాసగిరి ప్రదర్శన



(సత్యంన్యూస్, పొందూరు)

జి.సిగడాం మండలం ఎందువ గ్రామంలోని శ్రీ కైలాశేశ్వర క్షేత్రం వద్ద ఈ నెల 15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని గిరి ప్రదర్శన జరుగుతుందని ఆయల కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. కైలాసగిరిపై స్వయంభూగా వెలసిన శ్రీ కైలాశేశ్వరస్వామి, కొండ దిగువన శ్రీ ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. 400 ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన ఆలయమని, ఇక్కడ ఆంజనేయస్వామి, నవదుర్గ, దత్తాత్రేయ, కామేశ్వరీదేవి, సంతోషిమాత, ధన్వంతరి, సూర్యనారాయణ తదితర ఆలయాలు ఉన్నాయని, అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలసిల్లుతున్న కైలాశేశ్వర క్షేత్రం వద్ద ఈ ఏడాది కార్తీక పౌర్ణమి శుక్రవారం తొలిసారిగా గిరి ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వివరించారు. గిరి ప్రదర్శన ఆరోజు ఉదయం 5 గంటలకు శివాలయం వద్ద ప్రారంభమై ఎందువ, నడిమివలస, ఎస్.భీమవరం, గెడ్డ కంచరాం శ్రీ పైడితల్లి అమ్మవారి వనం మీదుగా ఎందువ వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర జరుగుతుందన్నారు. ఎందువ శ్రీ శివదీక్షా భక్త బృందం ఈ గిరిప్రదర్శనను ఏర్పాటు చేస్తోందని, భక్తులంతా ఈ గిరి ప్రదర్శనలో పాల్గొనాలని కమిటీ పెద్దలు కోరారు.

# గ్రంథాలయ వారోత్సవాలకు ఆహ్వానం

(సత్యంన్యూస్, పాలకొండ)

ఈనెల 14 నుంచి సీతంపేట శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలకు సబ్ కలెక్టర్, ప్రాజెక్టు ఆఫీసర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డిని గ్రంథపాలకుడు బబ్బురు గణేష్‌బాబు ఆహ్వానిస్తూ పత్రికను అందించారు. 14న గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని, జవహర్ లాల్ నెహ్రూ జయంతి, మిఠాయిలు పంపిణీ, 15న పుస్తక ప్రదర్శన, సభ్యత్వ నమోదు, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్నవారి స్మరణ, 17న కవి సమ్మేళనం, 8, 9, 10 తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, 18న యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు, 19న ఇందిరా గాంధీ జయంతి వేడుకలు, ముగ్గుల పోటీలు, అలాగే 20న వారోత్సవాల ముగింపు ఉంటుందని వివరించారు. వారోత్సవాల్లో గెలుపొందిన వారికి చివరి రోజు బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.